సాక్షి శ్రీకాకుళం

ఆదివారం | 10 | సెప్టెంబర్ | 2023



కంటికి రెప్పలా..

ప్రభుత్వ ఈ–ఐ కేంద్రాలకు ఓపీ పెరుగుతోంది. చక్కటి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

-IIలో



జిల్లాపై నిఘా నేత్రం

జిల్లాలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. దీని ద్వారా శాంతిభద్రతలు పర్యవేక్షించనున్నారు.

-IIలో

విద్యార్థులకు అభినందనలు

కవిటి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలబాలికలు సత్తాచాటారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో పైస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రాణించాలని హెచ్‌ఎం సుమలత అన్నారు.

న్యూస్‌రీల్

మంత్రి ధర్మానకు స్వల్ప గాయం

శ్రీకాకుళం: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్వల్పంగా గాయపడ్డారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం ఆయన వ్యాయామం చేస్తుండగా కాలు బెణికింది. కొన్ని ప్రైవేటు, ప్రభుత్వ కార్యక్రమాలు ఉండటంతో శనివారం రోజంతా కాలి నొప్పితోనే హాజరయ్యారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించేందుకు వెళ్లిన ఆయనకు కాలు నొప్పి తీవ్రం కావటంతో నడవలేకపోయారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతితో ఉండాలని సూచించారు. దీంతో ఆది, సోమవారం నాటి కార్యక్రమాలను రద్దు చేసుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించారు. నడవలేని స్థితిలో ఉండటంతో మంత్రి ధర్మాన ఎవరినీ కలిసే అవకాశం లేదు.

9255 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు రాజీ మార్గంలో పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 11 న్యాయస్థానాల పరిధిలో 21 బెంచీలను ఏర్పాటు చేసి 9255 కేసులు పరిష్కరించారు. జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌ను అన్ని కోర్టుల పరిధిలోనూ నిర్వహించారు. ఈసారి జిల్లాలో ఎక్కువగా శ్రీకాకుళం, రాజాం కోర్టుల పరిధిలో కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. సివిల్ కేసులు 142, క్రిమినల్ కేసులు 9005, పీఎల్‌సీ కేసులు 108 పరిష్కరించారు. దీని ద్వారా రూ.4,84,09,661 కక్షిదారులు లబ్ధి పొందారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

పొందూరు: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని లోలుగు కేజీబీవీ విద్యార్థినులు పలు క్రీడల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు మొకర రూపవతి తెలిపారు. అండర్–14 విభాగంలో షాట్‌పుట్‌లో కె.జానకి ప్రథమస్థానం, జి.అంజలి తృతీయ స్థానంలో నిలిచారు. అండర్–16 విభాగంలో షాట్‌పుట్‌లో ఎం.ద్రాక్ష ప్రథమ స్థానం, కె.రాజేశ్వరి తృతీయ స్థానం, జావెలిన్‌త్రోలో వై.రమ తృతీయ స్థానంలో నిలిచారు. అండర్–18 విభాగంలో షాట్‌పుట్‌లో ఆర్.అనూష ప్రథమ స్థానంలో నిలిచి ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 13వ జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం జరగనున్నాయి. ఈ పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు మొదలుకానున్నాయి. క్యాడెట్, సబ్‌జూనియర్స్, జూనియర్స్, యూత్, సీనియర్స్ వయో విభాగాల్లో వివిధ కేటగిరిల్లో ఈ పోటీలు జరగనున్నాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఇక్కడ రాణించిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

స్కాములే బాబు స్కీములు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు..

ఆ నేపథ్యంలో నిరసనల పేరుతో ఆ పార్టీ శ్రేణులు చేసిన రచ్చ చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మేధావులైతే ఈ ధోరణిని తప్పు పడుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ అధికారులు అరెస్ట్ చేయడం అన్యాయమంటూ చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు అడ్డుకోవడానికి ప్రయత్నించడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అందుకే చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ జిల్లాలో టీడీపీ చేపట్టిన నిరసనలకు అసలు స్పందన కనిపించలేదు. అయితే ముందు జాగ్రత్తగా పోలీసులు జిల్లాలో 520 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన పాలకులే పక్క దారి పట్టించినట్లు ఆధారాలు లభిస్తే అరెస్టు చేయడాన్ని ఎలా తప్పుపడతారని అంటున్నారు. చంద్రబాబుపై గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అయితే కోర్టు స్టేలు, వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారా ఆయన ఇన్నాళ్లు తప్పించుకున్నారని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

- చంద్రబాబు సూత్రధారి
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన చంద్రబాబు వ్యవహారంపై జిల్లా వ్యాప్తంగా చర్చ
- చంద్రబాబు అవినీతిని తప్పుపడుతున్న మేధావులు
- అరెస్టుకు వ్యతిరేకంగా టీడీపీ నిరసనలు
- ప్రజల నుంచి కానరాని మద్దతు
- శాంతిభద్రతల దృష్ట్యా 520 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌ను కాస్తా స్కామ్‌గా మార్చేసుకున్నారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు యువతకు శిక్షణ పేరుతో ప్రజా ధనాన్ని లూటీ చేసేశారు. సీమెన్స్ కంపెనీ పేరుతో బోగస్ వ్యక్తులతో ఒప్పందం చేసుకుని రూ.371కోట్లకు పైగా ప్రభుత్వ నిధులను షెల్ కంపెనీల ద్వారా కొట్టేశారు. ఇప్పుడా స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. ముఖ్యమంత్రి హోదాలో ఆర్థిక శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి స్వాహాకు పాల్పడ్డారు. సీఐడీ విచారణలో ఇవన్నీ తేలడంతో ఎట్టకేలకు శనివారం ఉదయం సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారు.' జిల్లావ్యాప్తంగా ఇప్పుడిదే హాట్ టాపిక్. తప్పు చేసి అడ్డంగా బుక్ అయిపోయారంటూ చంద్రబాబు నైజాన్ని అంతా గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు అరెస్టును ప్రజలు తేలికగా తీసుకున్నారు. అవినీతి చేసినందుకు తగిన శిక్ష పడాల్సిందేనని అభిప్రాయపడ్డారు. టీడీపీ శ్రేణులు అక్కడక్కడా ఆందోళనలు చేసినా ప్రజలు పట్టించుకోలేదు. సానుభూతి వస్తుందేమోనని ఆశించిన తెలుగు తమ్ముళ్లకు ప్రజలు షాకిచ్చారు. చేసిన అక్రమాలు ప్రజలకు తెలియకుండా కొన్నాళ్లు మేనేజ్ చేస్తారేమో గానీ కాలం మరిచి పోదని మరోసారి రుజువైంది. చంద్రబాబు విషయంలో అచ్చంగా అదే జరిగిందని ప్రజలు భావిస్తున్నారు. అందుకనే చంద్రబాబు అరెస్టయిన తర్వాత జిల్లాలో ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. ప్రజల మద్దతు ఎక్కడా కనిపించలేదు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అక్కడక్కడ టీడీపీ నాయకులు ఆందోళనలు చేశారు. కొన్ని చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు కాస్త ఇబ్బంది కలిగించే ప్రయత్నం చేశారు. కొన్నిచోట్ల బలవంతంగా షాపులు మూయించేసి బంద్ కోసం ప్రయత్నించారు. కానీ అవేవీ సఫలం కాలేదు.

పార్టీ పిలుపు మేరకు దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు సైతం వారిని కట్టడి చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ముందుస్తుగా కొందర్ని, ఆందోళన కార్యక్రమాలు చేపడుతుండగా మరికొందర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 520 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అటు శ్రేణుల నుంచి, ఇటు ప్రజల నుంచి సరైన స్పందన లేకపోవడంతో టీడీపీ నాయకులు కాస్త డీలా పడ్డారు. మరింత గట్టిగా పనిచేయాలని కేడర్‌కు సందేశాలు పంపించారు కాకపోతే, ఆ చొరవ, స్పందన క్షేత్రస్థాయిలో రాలేదు. అనుకున్నట్టుగా జరగలేదని ముున్ముందు ఏం చేస్తారో తెలియదు గాని చంద్రబాబు అరెస్టు వ్యవహారం జిల్లా ప్రజలను, ఆ పార్టీ శ్రేణులను పెద్దగా ఆశ్చర్యపరచలేదు. సానుభూతి కూడా వ్యక్తం కాలేదు. ఆ పార్టీ సోషల్ మీడియా సానుభూతి కోసం మేకపోతూ గాంభీర్యం ప్రదర్శించేలా ప్రచారం చేసుకోవడం తప్ప అంతకుమించి సానుకూలత కనిపించలేదు. మేధావి వర్గం సైతం చంద్రబాబు అరెస్టును సమర్థించింది. బాబు అక్రమాలను తప్పు పట్టింది. తప్పుచేసిన వారికి శిక్ష పడాల్సిందేనని కోరుతోంది.

చంద్రబాబు పాపం పండింది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనేది స్పష్టమైందని, సీఐడీ అన్ని ఆధారాలు సేకరించిందని, బాబు పాపం పండిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇన్నాళ్లూ వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకున్నారని, చట్టం ఎవరికీ చుట్టం కాదని ఇప్పుడు చంద్రబాబు కేసులో నిరూపితమైందన్నారు. బాబు అరెస్టుతో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అవినీతి ప్రజలందరికీ ముందుగానే తెలుసని, అయితే పక్కా ఆధారాలు ఇప్పటి వరకూ లభించలేదని ఇప్పుడు లభించడంతో ప్రజలు బాబు అవినీతిని గమనిస్తున్నారని అన్నారు.

అరెస్టు సబబే



ప్రజా ధనం రూ. 550 కోట్లు దుర్వినియోగం చేసిన కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడంలో ఏ మాత్రం తప్పు లేదు. ప్రభుత్వ ధనం పక్క దారి పట్టించి తాను స్వప్రయోజనం పొందినట్లు ఏపీ సీఐడీ దర్యాప్తు చేసి నివేదిక రూపొందించింది. ఈ కేసులో ఏ– 1గా ఉన్న చంద్రబాబును అరెస్టు చేయకపోతే తప్పు సీఐడీదే అవుతుంది. తప్పు చేయకపోతే కోర్టులో నిరూపించుకోవడమే. నేను మాజీ ముఖ్యమంత్రిని నేను తప్పు చేసినా అరెస్టు చేయకూడదు అంటే ఎలా కుదురుతుంది.

– ఎస్.ప్రభాకరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, నరసన్నపేట

ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది



చంద్రబాబు అరెస్టుతో ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది. ఎన్టీఆర్ అభిమానులు ఎప్పటి నుంచో ఈ రోజు కోసం ఎదురు చూస్తున్నారు. బాబు కుట్రలు, అవినీతికి జీవితాంతం జైల్లో ఉంచినా తప్పులేదు

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్ చాన్స్‌లర్

చంద్రబాబుకు తగిన గుణపాఠం



నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కొట్టుకుపోయినట్లుగా ఇన్నాళ్లకు చంద్రబాబుకు తగిన శిక్ష పడింది. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఎంతో మంది జీవితాలను నాశనం చేశారు. ఎన్టీఆర్‌ను ఆత్మక్షోభకు గురి చేశారు. ఇలాంటి చంద్రబాబు ఇప్పుడు అడ్డంగా ఆధారాలతో దొరికిపోయారు.

– జీవీ రెడ్డి మాస్టారు, మేధావుల ఫోరం అధ్యక్షుడు, టెక్కలి

శిక్ష పడేలా చేయాలి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: స్కిల్ స్కామ్‌లో స్కిల్డ్ క్రిమినల్‌ని చాలా స్కిల్డ్‌గా అరెస్ట్ చేయడం జరిగిందని రాష్ట్రపశుసంవర్థక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం కాదు శిక్షపడేలా చేయాలనే బాధ్యతను గుర్తు చేస్తున్నానని అన్నారు. చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం రాష్ట్రానికి ఈ రోజు ఒక శుభకరమైన రోజని అన్నారు. ఇన్నాళ్లు చంద్రబాబు తాను నిప్పునని చెప్పేవారిని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇన్నాళ్లూ ఆయన సాగించిన అక్రమాలకు ఇక చరమ గీతం పాడే రోజు వచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడుపై 2020–21లో కేసు నమోదైందని, ఆ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌ను పరిశీలిస్తే డబ్బులు కొట్టేయడంలో చంద్రబాబు ఎంత స్కిల్ ఉందో తెలుస్తుందన్నారు. అరెస్టు చేస్తున్నప్పుడు ఆరోగ్య సమస్యలు చెబుతున్నారని, మరి బస్సులు ఎక్కడానికి, నిచ్చెనలు ఎక్కి దిగడానికి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయడానికి ఆరోగ్యం సహకరిస్తుందా అని మంత్రి ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తులు ఉండాల్సింది జైలులోనే తప్ప ప్రజా జీవితంలో కాదన్నారు.



ఆమదాలవలసలో టీడీపీ కార్యకర్తల నిరసన

చట్టం ఎవరికీ చుట్టం కాదు

- ఎం.వి స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): చట్టం అందరికీ సమానమేనని, ఎవరికీ చుట్టం కాదని వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవస్థలపై నమ్మకం పెంచే విధంగా దర్యాప్తు సంస్థల్లో పనిచేస్తున్న వారిపై విశ్వాసం పెంచేలా ఇలాంటి చర్యలు చోటు చేసుకోవడం ఓ శుభ పరిణామని అన్నారు. రాజకీయ అవినీతి అన్నది ఎన్నాళ్ల నుంచో ఉందని, చంద్రబాబు లాంటి సీనియర్ లీడర్లు తమను ఎవరూ ఏమీ చేయలేరన్న భావనతో ఉండేవారని, ఆ అపోహలను పటాపంచలు చేస్తూ ఇవాళ దర్యాప్తు సంస్థలు సీఐడీ విభాగం తీసుకున్న చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు. తప్పు చేస్తే ఎలాంటి వారికైనా శిక్ష తప్పదని నిరూపించిందని, చంద్రబాబు అరెస్టుతో రాజకీయ రంగంలో ఉన్న వారెవ్వరికైనా భయం పుట్టేలా చేసిందన్నారు.

బాబు పాలనే అవినీతిమయం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్



రణస్థలం: చంద్రబాబు పాలన అంతా అవినీతిమయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అరెస్టు, అవినీతి బాగోతంపై విలేకరులతో మాట్లాడారు. సీఐడీ అధికారులు రెండేళ్ల పాటు ఆధారాలు సేకరించి చంద్రబాబును అరెస్టు చేశారని తెలిపారు. ఇక బాబు స్కామ్‌లు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయని పేర్కొన్నారు. జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఐటీ, ఈడీ, సెబీ ఇలా ఉన్నత దర్యాప్తు సంస్థలన్నీ దర్యాప్తు చేసిన స్కామ్ ఇదని వెల్లడించారు. ఇదే కాదు చంద్రబాబు గత 2014–19 మధ్య నీరు–చెట్టు రూపంలో వాళ్ల నాయకులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తన కుమారుడు అందరూ దోపిడీ చేశారని అన్నారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో చేసిన దోపిడీలకు శిక్షలు వేస్తే తను బతికినంత కాలం జైల్లో ఉండాలని అన్నారు.

లెక్కలు చెప్పాల్సిందే

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: స్కిల్ డెవలప్‌మెంట్‌లో దోచుకున్న సొమ్ముకు చంద్రబాబు లెక్కలు చెప్పాల్సిందేనని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందని, తగిన ఆధారాలతో చంద్రబాబుని అదుపులోకి తీసుకున్నారని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అవినీతి స్కామ్‌లో చంద్రబాబు ప్రధాన పాత్రదారి అన్నారు. ప్రభుత్వ సొమ్మును విదేశాలకు పంపించి అక్కడి నుంచి చంద్రబాబు స్థాపించిన బినామీ కంపెనీలకు మళ్లించి స్వాహా చేసుకున్నారని వివరించారు. చంద్రబాబు అవినీతి అక్రమాలను ఐటీ, ఈడీ, సీఐడీ దర్యాప్తు బృందాలు చంద్రబాబు పాలనలోనే గుర్తించి దర్యాప్తు ప్రారంభించాయని గుర్తు చేశారు.

చంద్రబాబు అవినీతి అంకం ముగిసింది

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టెక్కలి: చంద్రబాబు తన రాజకీయ జీవితంలో దశాబ్దాలుగా అన్ని వర్గాలకు చేసిన పాపం ఫలితంగానే ఈ రోజు జైలు జీవితానికి దగ్గరయ్యారని, దీంతో చంద్రబాబు అవినీతి అంకం ముగిసిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2019 టీడీపీ హయాంలో ఈఎస్‌ఐ, స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి రాజధాని నిర్మాణంలో చేసిన కుంభకోణాల్లో ఆధారాలతో సహా సంబంధిత అధికారులు నిరూపణ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రజా ధనం లూటీ చేయకపోతే ఆయన పీఎస్ శ్రీనివాస్‌తో పాటు కంపెనీ ప్రతినిధులు మనోజ్, యోగేష్ గుప్తాలు ఎందుకు పరారయ్యారని ప్రశ్నించారు.

దోషుల్ని శిక్షించాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



కవిటి : రాష్ట్రంలో తమ పాలనాకాలంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి తమ అధినేత చంద్రబాబు చేసిన తప్పిదాలపై తెలుగు తమ్ముళ్లు తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరించడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. రూ.371 కోట్ల నిధుల్ని అక్రమంగా కొల్లగొట్టిన అక్రమాలపై మరింత లోతైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇందుకు బాధ్యులైన వారందరినీ గుర్తించి న్యాయస్థానం ఎదుట హాజరుపర్చి కఠిన శిక్షలను సైతం విధించాలన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయిరాజ్

చంద్రబాబుది తీరని మోసం

కవిటి: రాష్ట్ర విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి చంద్రబాబు తీరని మోసం చేశారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త సాయిరాజ్ అన్నారు. వారు బల్లిపుట్టుగలోని తమ నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏకకాలంలో జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఐటీ, ఈడీ, సెబీ వంటి సంస్థలన్నీ లోతైన పరిశీలన చేసి అభియోగాలు మోపాయన్నారు. విభజనకు గురైన సందర్భంలో పాలనా పగ్గాలు చేపట్టి చంద్రబాబు ప్రభుత్వంపై కాగ్ సైతం తన నివేదికలో లోపాల్ని తేటతెల్లం చేసిందని గుర్తు చేశారు.

శిక్షణతో మెరుగైన సేవలు



శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శిక్షణలతో మెరుగైన సేవలు సాధ్యమవుతాయని జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకట్రామన్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహించిన రెండో విడత పంచాయతీ కార్యదర్శుల ఆరు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణలో పంచాయతీ రాజ్ చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించటంతోపాటు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించినట్లు చెప్పారు.

ముగిసిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు



1500 మీటర్ల పరుగును ప్రారంభిస్తున్న పి.సుందరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ముగిశాయి. ఏలూరు వేదికగా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలు శనివారం నిర్వహించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 800 మంది వరకు క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అండర్–14, 16, 18, 20, 23 వయో విభాగాల్లో బాలబాలికలకు రన్స్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్‌లలో ఈ ఎంపికలను నిర్వహించారు. అంతకుముందు ఈ ఎంపికలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సలహాదారుడు పి.సుందరరావు, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తదితరులు ప్రారంభించారు. రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడించనున్నారు.

క్లుప్తంగా

'జీతాలు చెల్లించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: బదిలీ అయిన టీచర్ల జీతాలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భైరి అప్పారావు అన్నారు. శ్రీకాకుళంలోని పీఆర్‌టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాల చెల్లింపులు ఇంకా జాప్యమైతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ట్రెజరీ కార్యాలయాల ముందు ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

16,17 తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఉన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కాలేజ్ వేదికగా ఈ నెల 16, 17 తేదీల్లో ప్రముఖ ఫార్మాకంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయకుమార్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డి.శైలజ తెలిపారు. ఫార్మా రంగంలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూణెలో ఉన్న హానర్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎస్యూరెన్స్, స్టోర్స్, సేఫ్టీ, పర్చేజ్ విభాగాల్లో ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుపుతున్నట్టు చెప్పారు. 2018 నుంచి 2023 సంవత్సరంలో బీటెక్ మెకానికల్, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సి కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ ఆర్గానిక్, ఎనలిటికల్ కెమిస్ట్రీ, పాలిటెక్నిక్, బీఏ, బీకాం, ఐటీఐల్లో ఉత్తీర్ణులైన పురుష విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి జీతం ఏడాదికి రూ.2.4లక్షల నుంచి రూ.2.9లక్షల వరకు ఉంటుందని, దీంతోపాటు ఉచిత వసతి, భోజన, రవాణా సౌకర్యాలను కంపెనీ కల్పిస్తుందన్నారు. ఎంపికైనవారు కంపెనీకి ఎలాంటి ఒరిజనల్ సర్టిఫికెట్లు గానీ, డిపాజిట్ గానీ ఇవ్వాల్సిన అవసరం లేదని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేసినట్టు వారు చెప్పారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు 7337041426 (ఎ.నరేష్) నంబర్‌కి ఈనెల 14వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా రూ.100 ఫోన్‌పే చేసి ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ పురుష అభ్యర్థులు వివరాలు కోసం టి.విజయ కుమార్(9392255211), డి.శైలజ (90301 94567), ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు (9966255963), ఎ.నరేష్ (7337041426) లను సంప్రదించాలన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

కంటికి రెప్పలా..



పలాస ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రంలో ఆధునిక యంత్రాలతో పరీక్షలు

- ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు పెరుగుతున్న ఓపీ
- జిల్లాలోని ఆరు సామాజిక ఆస్పత్రుల్లో సేవలు
- కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు, కళ్లద్దాల పంపిణీ సక్సెస్

కాశీబుగ్గ:

జిల్లాలో అధునాతన పద్ధతిలో ప్రభుత్వం చేపడుతున్న ఉచిత నేత్ర పరీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఆరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఉన్న ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో పరీక్షలు ప్రత్యేకమైన ఆధునిక యంత్రాలతో చేపడుతున్నారు. 60 ఏళ్లలోపు వారందరికీ ఉచితంగా శుక్లాలు, దృష్టి లోపం వంటి వివిధ కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. చక్కెర వ్యాధిగ్రస్తులకు అతి ఖరీదైన పండస్ రెటినో పరీక్షలను నిర్వహించి ఫలితాలను ఆయా ముఖ్యమంత్రి ఈ–ఐకేంద్రాల్లో తెలియజేస్తున్నారు.

అత్యాధునిక మిషనరీలతో పరీక్షలు

ప్రభుత్వ ఆస్పత్రిలో కేవలం ఆధార్ నంబర్ ఆధారంగా నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. వారి ఐడీని క్రియేట్ చేసి కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేపడుతున్నారు. సుమారు ఒక్కోటి రూ.8 లక్షలకుపైగా విలువైన రెండు మిషనరీలు ప్రతి కేంద్రంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆటో రిఫ్లక్షన్ మిషన్, రెటీనా పరీక్షల మిషన్‌తో పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు చాలా ఖరీదు. ఇది వరకు కాగితాల బొమ్మలను చూపించి దృష్టి శాతాన్ని నిర్ధారించేవారు. ప్రస్తుతం డిజిటల్ మిషన్‌లను పెట్టి గోడపై విద్యుత్ తెరలను వినియోగిస్తున్నారు.

జిల్లాలో కంటి వైద్య సేవల సెంటర్లు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కంటి వైద్య సేవల్లో అనేక రకాలైన నూతన విధి విధానాలను తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆస్పత్రులకు రిఫర్ చేసినవారికి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్‌లో ఉచిత ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న కంటి వైద్య సెంటర్లు ముఖ్యంగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, ఇచ్ఛాపురం, పాతపట్నం, రణస్థలం, ఆమదాలవలసలలో ఉన్నటువంటి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



కంటి సమస్యలను చూపించే ప్రొజెక్టర్‌లు

పేదలకు ఉచితంగా అద్దాలు

రేషన్ కార్డుతో అవసరం లేకుండా ఆధార్ కార్డు ప్రకారం ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో 60 ఏళ్లలోపు వారికి కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు దృష్టిలోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్లద్దాలను అందజేస్తున్నారు. ఆ వ్యక్తి రంగును ఎంచుకుని కళ్లద్దాల నచ్చిన ఫ్రేమ్‌ను పొందవచ్చును. ఉచిత పరీక్షలు ప్రభుత్వ సెలవుదినంలో తప్ప అన్ని రోజులు లభిస్తాయి. పాఠశాలలో చిన్నారులకు సైతం పరీక్షలు చేపట్టి వారికి ఉచిత కళ్లద్దాలను ఇక్కడి నుంచి పంపిస్తున్నారు. పరీక్షల్లో భాగంగా ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచితంగా ఎన్‌జీఓల ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు నాణ్యతతో చేయిస్తున్నారు. ముఖ్యంగా శుక్లాల ఆపరేషన్, టెరిజం (పొర)ఆపరేషన్‌లు ఉచితంగా రిమ్స్‌లో సేవలు అందిస్తారు. ఇవే కాకుండా ప్రభుత్వ నుంచి మల్టీ విటమిన్ టాబ్లెట్‌లు, సిప్రాఫ్లాక్స్ చుక్కలు మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సీహెచ్‌సీల వారీగా 2022 జనవరి నుంచి 2023 జూలై వరకు..	
పలాస సీహెచ్‌సీలో ఓపీ	6938
అద్దాలు అందుకున్నవారి సంఖ్య	5272
ఇచ్ఛాపురంలో ఓపీ	7395
అద్దాలు అందుకున్నవారు	5173
పాతపట్నంలో ఓపీ	7346
కళ్లద్దాలు అందుకున్నవారు	5238
ఆమదాలవలసలో ఓపీ	6805
కళ్లద్దాలు అందుకున్న వారు	4708
రాజాంలో ఓపీ	11605
కళ్లద్దాలు అందుకున్న వారు	9003
రణస్థలంలో ఓపీ	11,681
కళ్లద్దాలు అందుకున్న వారు	7489

కంటి వైద్యం ఉచితం

ఆప్తమాలజిస్టు, ఆప్తమాలజీ అసిస్టెంట్, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్‌లతో జిల్లాలో ఉన్న ఆరు కేంద్రాల్లో సేవలు అందజేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు అనుకూలంగా సేవలు లభిస్తున్నాయి. ఆధార్ కార్డు తీసుకుని సెంటర్‌కు వస్తే ఉచిత పరీక్షలు చేయించి అవసరమైన వారికి అద్దాలు, మందులు అందిస్తాం. ఆపరేషన్‌లు అవసరం అయినవారికి ఆయా సూపరింటెండెంట్‌ల రిఫరల్‌తో రిమ్స్‌కు పంపిస్తున్నాం. పేద, మధ్య తరగతికి చెందినవారు అనవసరంగా ఖర్చు పెట్టుకుంటున్నారు. చక్కనైన వైద్య సేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

– శ్రీనివాసరావు, మేనేజర్, జిల్లా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రం

నచ్చిన రంగులో అద్దాలు పొందాను

మాది కంచిలి మండలం నరసన్నముకుందపురం గ్రామం. నాకు కంటి సమస్యలు వచ్చాయని ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ ఓపీకి వచ్చాను. వారు ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రంలో సేవలకు పంపించారు. అప్పుడు తెలిసింది నాకు ఉచిత పరీక్షలతో పాటు ఉచితంగా అద్దాలు ఇస్తారని. అవసరం అయితే ఆపరేషన్‌కు పంపిస్తామన్నారు. వారం రోజుల్లోనే నాకు నచ్చిన రంగుల ఫ్రేమ్‌తో అద్దాలు అందజేశారు. పేదవారికి చక్కటి అవకాశం ఇది.

– నెయ్యిల నారాయణ, నరసన్నముకుందపురం గ్రామం, కంచిలి మండలం

ఉన్నత వైద్యం అందిస్తేనే గుర్తింపు

- వండాన ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన



వండాన ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

అరసవల్లి: జిల్లాకు ఇప్పటికే అత్యున్నత వైద్య సదుపాయాలు వచ్చేశాయని, అదే క్రమంలో 'వండాన' ఆస్పత్రిలో కూడా ఉన్నతమైన వైద్యాన్ని అందించి మంచి గుర్తింపును కొనసాగించుకోవాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. స్థానిక 80 ఫీట్ రోడ్డులో వండాన కిరణ్‌కుమార్, సచిత్రల ఆధ్వర్యంలో శనివారం ఆధునిక వసతులతో, వైద్య సౌకర్యాలతో కూడిన 'వండాన' ఆస్పత్రిని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. జిల్లాలో సీనియర్ వైద్యులుగా డాక్టర్ వండాన శేషగిరిరావుకు మంచి పేరుందని, ఆ పేరును ఆయన కుమారుడు కిరణ్ నిలబెట్టుకుని మరింత గుర్తింపు పొందాలని ఆశీర్వదించారు. ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోన్న తరుణంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు జిల్లాలో అందుతుండడం ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వండాన శేషగిరిరావు, వండాన కిరణ్‌కుమార్, డాక్టర్ సచిత్ర, వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మాన రామమనోహర్ నాయుడు, డాక్టర్ దానేటి శ్రీధర్, అంబటి శ్రీనివాసరావు, ఎంపీ పద్మావతి, చల్లా శ్రీనివాసరావు, ధర్మాన రామలింగంనాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చోరీకి విఫలయత్నం

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి ఇన్‌పేషెంట్ వార్డులో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఓ వ్యక్తి చోరీ చేయడానికి విఫల యత్నం చేశాడు. ఆస్పత్రి సిబ్బంది, రోగులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పత్రిలోని ఎంఎస్, ఎంఎంఐడీ వార్డుల్లో అర్ధరాత్రి తర్వాత ఓ వ్యక్తి ప్రవేశించి పలువురు మహిళల మెడలో బంగారు గొలుసులు, కాళ్ల పట్టీలు తీసేందుకు ప్రయత్నించాడు. రోగులు కేకలు వేయడంతో పరారైపోయాడు. దీనిపై టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణకు ఆస్పత్రి సిబ్బంది ఫిర్యాదు చేశారు.

జిల్లాపై నిఘానేత్రం



కాశీబుగ్గ బస్టాండు కూడలిలో..

శ్రీకాకుళం క్రైమ్ : నేర నియంత్రణలో నిఘా పాత్ర ఎంతో కీలకమని పోలీసు యంత్రాంగం భావిస్తోంది. దీనిలో భాగంగానే ఈ 2023లో 1416 సీసీ కెమెరాలు (పీటీజెడ్ –58, బుల్లెట్ –136, జనరల్ –1222) ఇప్పటివరకు మూడు సబ్ డివిజన్‌ల (శ్రీకాకుళం –754, టెక్కలి –376, కాశీబుగ్గ –286) పరిధిలో ఏర్పాటుచేశారు. మరిన్ని పెంచే యోచనలో ఉన్నారు. శ్రీకాకుళం సబ్‌డివిజన్‌లోని శ్రీకాకుళం వన్‌టౌన్‌లో 110, టూటౌన్ 129, రూరల్ 108, గార 69, ఆమదాలవలస 43, సరుబుజ్జిలి 32, బూర్జ 12, పొందూరు 94, జి.ఆర్.పురం 4, ఎచ్చెర్ల 42, లావేరు 73, జి.సిగడాంలో 38 కెమెరాలు అమర్చారు. టెక్కలి సబ్ డివిజన్‌లో టెక్కలిలో 30, కోటబొమ్మాళి 48, సంతబొమ్మాళి 14, నౌపడ 14, నందిగాం 50, నరసన్నపేట 71, జలుమూరు 26, పోలాకి 10, సారవకోట 39, పాతపట్నం 12, మెళియాపుట్టి 08, కొత్తూరు 50, హిరమండలం 04 సీసీ కెమెరాలు అమర్చారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో కాశీబుగ్గలో 32, మందస 25, వజ్రపుకొత్తూరు 45, సోంపేట 40, బారువ 24, కంచిలి 34, ఇచ్ఛాపురం టౌన్ 07, ఇచ్ఛాపురం రూరల్ 58, కవిటిలో 21 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు, ఫెన్సింగ్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్–10,12 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్ హాల్ వేదికగా నిర్వహించిన ఈ పోటీలను వ్యాపారవేత్త బలభద్రుని రాజా, జర్నలిస్ట్ ఎం.సుధీర్ వర్మలు ప్రారంభించారు. జిల్లాలో ఫెన్సింగ్ క్రీడకు రోజురోజుకి ఆదరణ పెరుగుతుండటం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఫెన్సింగ్ ఎంపిక పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక్కడ ఎంపికచేసిన జిల్లా క్రీడాకారులు ఈ నెల 12వ తేదీన కాకినాడ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి అండర్–10, 12 చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఎన్‌ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఈ పోటీలలో ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్, గురుగుబెల్లి ప్రసాద్, సంపతిరావు నాయుడు, పీడీ డి.భవానీ, పీఈటీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని మహిళ మృతి



గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందిన సప్ప చిన్నమ్మి

నందిగాం: మండల పరిధిలోని సుభద్రాపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని అదే గ్రామానికి చెందిన సప్ప చిన్నమ్మి(63) అనే మహిళ మృతి చెందారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నమ్మి శనివారం ఉదయం 5 గంటలకు స్నానం చేసేందుకు బావికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నమ్మి భర్త అప్పయ్య ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో మరో దూడ మృతి

మందస: మండలంలోని ఉద్దానంలో గుర్తు తెలియని జంతువు దాడి కొనసాగుతోంది. ఇటీవల పలు దూడలపై దాడులు చేసి, చంపి తినేస్తున్న ఈ జంతువు శుక్రవారం రాత్రి మరో దూడను బలి తీసుకుంది. అంబుగాం పంచాయతీ పెద్దలింబుగాం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే రైతు పెరటిలోని పశువుల శాలలో కట్టిన దూడ(పెయ్యి) శనివారం తెల్లవారి చూసేసరికి మరణించి పడి ఉంది. దూడ గొంతు కొరికి చంపేసిన ఆనవాళ్లు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం ఇదే గ్రామంలో ఓ మేకను కూడా చంపేసింది. ఉద్దానంలో జరుగుతున్న వరుస జంతువుల మరణాలపై అటవీ శాఖాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెద్దలింబుగాంలో మరణించిన దూడ



సౌదీలో జిల్లా యువకుడు మృతి



మృతుడు కొమర రోహిత్

సంతబొమ్మాళి: మండలంలోని మలగాం పంచాయతీ కారిపేట గ్రామానికి చెందిన కోమర రోహిత్ (30) అనే యువకుడు సౌదీ అరేబియాలోని షిప్‌లో సీమెన్‌గా పనిచేస్తూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. మూడు నెలల కిందట రోహిత్ సౌదీ వెళ్లాడు. షిప్‌లో ట్యాంకర్‌ను శుభ్రం చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు మృతి చెందగా అందులో రోహిత్ ఒకడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబాన్ని పోషించే కుమారుడు అందని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు భీమారావు, లక్ష్మీబాయి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్‌కు గాయాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్నపూర్ణ సినిమా హాల్ జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెకానిక్ తీవ్రంగా గాయపడ్డారు. నర్సిపురానికి చెందిన రవి అనే మెకానిక్ బైక్ ట్రిల్ రన్ వేస్తుండగా ఎదురుగా వస్తున్న జీడిపప్పు ఆటో ఢీకొట్టింది. జీవి వ్యాపారి పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ ఎస్‌ఐ షేక్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'15 నాటికి సవరణ జాబితా సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రక్రియ ఈ నెల 12 నాటికి అన్ని రకాల ఫారాలను ముగించి, 15 నా టికి సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియ 2024పై ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, ఈడీ టీలు, బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లతో కలెక్టర్ శనివారం క్యాంపు కార్యాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు ఇంటి నంబర్ల మార్పులు, 10మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న గృహాలు, అలాగే 100 ఏళ్లు నిండిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ మూడు వివరాలకు సంబంధించి జూన్ నాటికే సమాచారం అందుబాటులోకి వచ్చిందన్నా రు. అయినప్పటికీ ఇప్పటివరకు పెండింగ్ ఉందని, దీని పై అధికారులు సమీక్షించుకోవాలని చెప్పారు. సెప్టెంబర్ 15 నాటికి అన్ని పూర్తికావాలని ఆదేశించామని, అలాగే పలు సమావేశాలు నిర్వహించామని వివరించారు.

గడువుకు అతి తక్కువ సమయం ఉన్నందున శని, ఆదివారాలు సెలవు దినాలు అయినా విధులకు హాజరై పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మూడు మాసాల కిందటే ఫారం 8 తీసుకున్నప్పటికీ వాటిని అప్ డేట్ చేయకపోవడానికి గల కారణాలు వివరించాలని కోరారు. ఇప్పటివరకు 26వేల ఫారం 6 దరఖా స్తులు, 11, 500 ఫారం 7, 32,500 ఫారం 8 వెరసి 70వేలు పెండింగ్ ఉన్నాయని, జిల్లాలో బీఎల్ ఓలు 2,342 మంది ఉన్నందున ఒక్కొక్కరికి సగటున 35 ఫారాల వరకు వస్తాయని గుర్తుచేశారు. ఇంటింటి సర్వే పూర్తయి 17 రోజులు గడిచినప్పటికీ ఒక్కో బీఎల్ఓ 35 ఫారాలు కూడా పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

డ్రాఫ్ట్ రోల్ సెప్టెంబర్ 17 నాటికి వచ్చే అవకాశం ఉందని, మీ నిర్లక్ష్య ధోరణి వల్ల వాటిపై ప్రభావం చూపుతుందని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్నీ సకాలంలో జరగాలని, ఇందుకు పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలు పూర్తి కావాల్సి ఉందని కలెక్టర్ ఆకాంక్షించారు. శ్రీకాకుళం, పాతపట్నం, సంత బొమ్మాళి మండలాల తహసీల్దార్లు, ఈడీటీలు దీనిపై దృష్టి సారించాలని ఆదేశించారు.